క్లుప్తంగా

మాలకొండ ఆదాయం రూ.9,12,817

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,12,817 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.28,160, తలనీలాలు రూ.44,400, ప్రత్యేక దర్శనం రూ.2,99,300, లడ్డుప్రసాదాలురూ.2,06,775, అన్నదానం రూ.2,40.040, రూమ్‌అద్దెలు రూ.33,460 వచ్చినట్లు పేర్కొన్నారు.

నవోదయ పరీక్షకు 221 మంది హాజరు

కందుకూరు రూరల్: నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పరీక్షకు 280 మంది హాజరు కావాల్సి ఉండగా 221 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ నరసింహారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని 11కేవీ వీవీపీ ఫీడర్ పరిధిలోని తూర్పువడ్డెపాలెం, తూర్పు కమ్మపాలెం, తూర్పు శాలిపాలెం, రాళ్లవీధి, మారెమ్మ మిట్ట, దివి లింగయ్యనాయుడు ఇంటి ప్రాంతం, కోటారెడ్డినగర్, క్లబ్‌రోడ్, ఆదిఆంధ్ర కాలనీ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

సింగరాయకొండ: స్థానిక ప్రైవేట్ పాఠశాలలో శనివారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ మండల అధ్యక్షుడిగా పనపాకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కీర్తి శ్రీనివాసులు, ట్రెజరర్‌గా చిలకపాటి సుధాకరరావు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్‌గా జీవీఎల్ అజయ్‌కుమార్ చౌదరి, ఎ.జయలక్ష్మి, కె.అమరేశ్వర్, గౌరవాధ్యక్షులుగా నూకసాని వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుగా కె.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా దాసరి శ్రీనివాసులు వ్యవహరించారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరాయకొండ: టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా ఒక ప్రకటనలో తెలిపారు. పాకల పంచాయతీ చెల్లెమ్మగారి పట్టపుపాలెంలో ఆయా పోస్టును బీసీ–ఏ అభ్యర్థికి, పాతసింగరాయకొండ గ్రామంలోని పోస్టుకు బీసీ–డి, ఊళ్లపాలెం–1 కేంద్రంలో పోస్టును ఓసీ అభ్యర్థులకు కేటాయించినట్లు వివరించారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని, వయసు 2023 జూలై 1వ తేదీ నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామంలో కొప్పాలు సంతోష్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పలు రకాల 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 16 సీజ్ చేశామని ఎస్సై ఖాదర్‌బాషా శనివారం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

శ్రీరాముని అక్షతల పంపిణీ


అక్షితలను పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కందుకూరు: శ్రీరామ తీర్థ ట్రస్టు అందజేసిన శ్రీరాముని అక్షతలను వాసవీక్లబ్ లెజెండ్స్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చెక్కా వెంకట కేశవరావు, వాసవీ క్లబ్ పీఎస్టీలు రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ, నేరెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం

● పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి



దద్దాల గెలుపునకు సమష్టిగా పనిచేస్తామంటూ నినాదాలు చేస్తున్న వైఎం ప్రసాద్‌రెడ్డి, గుంటక, కస్తూరిరెడ్డి, జపన్య, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి దద్దాల నారాయణ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్య అన్నారు. స్థానిక జెడ్పీటీసీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ప్రకారం బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఎటువంటి విభేదాలు లేవని, చిన్న, చిన్న సమస్యలు సర్దుకుంటాయని, అందరం కలిసి ఐక్యతగా పనిచేసి దద్దాల నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. వెలిగండ్ల, కనిగిరి జెడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయించిన దద్దాల నారాయణకు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. రెండ్రోజుల్లో భారీ స్వాగత ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దద్దాల నారాయణ యాదవ్ పార్టీలోని ప్రతి నాయకుడిని కలుస్తారని చెప్పారు. మనమంతా కలిసి తిరిగి కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. ఎంపీపీ అత్యాల జపన్య, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, ఒకేరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కొల్లా సుబ్రహ్మణ్యం, కటికల వెంకటరత్నం, సిద్ధారెడ్డిలు మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి దద్దాల నారాయణ గెలుపుకు తామంతా కష్టపడి పనిచేస్తామన్నారు. గతంలో వెలిగండ్ల మండలం నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారని, మరలా వెలిగండ్ల మండలానికి చెందిన దద్దాల నారాయణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇవ్వడాన్ని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మండాది కృష్ణారెడ్డి, కొండారెడ్డి, సర్పంచ్‌లు దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, మూలే గోవిందరెడ్డి, గోడినారాయణరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, పార్టీ వివిధ విభాగాల నాయకులు పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, శిగా కృష్ణారావు, ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి, దద్దాల రాములు, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, వై మోహన్‌రెడ్డి, కరుణాకర్, మోహన్‌రావు, సుధాకర్‌రెడ్డి, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి

పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

పామూరు: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి అన్నారు. స్థానిక ఆయన నివాసంలో శనివారం పార్టీ సర్పంచ్‌లు, నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన హెచ్‌ఎంపాడు జెడ్పీటీసీ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్‌కు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎవరిని నియమించినా పార్టీ నాయకులంతా ఏకతాటిపై నిలిచి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు అంబటి కొండారెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చల్లా సుబ్బారావు, మార్కొండాపురం సర్పంచ్ పుట్లూరి నారాయణరెడ్డి, ఉపసర్పంచ్, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కేతు రమేష్‌రెడ్డి, అంచూరి సత్యంరెడ్డి, ముడియాల అనంతరెడ్డి, మందిరెడ్డి రామసుబ్బారెడ్డి, కోటపాటి రవికుమార్‌రెడ్డి, జొన్నలగడ్డ ప్రహ్లాద, పలువురు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో శనివారం అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో 41 పర్యాయాలు హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం మహిళలు శ్రీరామ నామం స్మరిస్తూ కోలాట ప్రదర్శనతో శోభాయాత్రలో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షురాలు పోకూరి సుజాత లక్ష్మి, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు ఏల్చూరి భవానీ, సెక్రటరీ కొత్తమాసు ఉదయలక్ష్మి, ట్రెజరర్ శ్రీరాం సుశీలదేవితోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశుభ్ర చేతులతో వ్యాధులు దూరం


హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ మనోహర్

కందుకూరు: మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందని, ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను శనివారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భోజనానికి ముందు, తరువాత చేతుల పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల క్రిముల ద్వారా వచ్చే అనేక రోగాలు దూరమవుతాయని చెప్పారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోపడుతుందని చెప్పారు. మెప్మా సీఎంఎం ఇంగర్సల్ బాబు, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా సమరం


సింగరాయకొండ : విజేతగా నిలిచిన క్రికెట్ జట్టుతో ఎంపీడీఓ జమీఉల్లా


విజేతగా నిలిచిన టంగుటూరు 2 జట్టుతో ఎంపీడీఓ రత్నజ్యోతి

● నియోజకవర్గ స్థాయి పోటీలకు జట్ల ఎంపిక

సింగరాయకొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ఆణిముత్యాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా సంబరాల్లో మండల స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీలోని టీపీ నగర్ సమీపంలోని మైదానంలో మూలగుంటపాడు–1, కనుమళ్ల జట్లు క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. విజేతగా నిలిచిన కనుమళ్ల జట్టును ఎంపీడీఓ షేక్ జమీఉల్లా ప్రత్యేకంగా అభినందించారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో కొండపి–1, పెద్ద కండ్లగుంట జట్లు తలపడ్డాయి. హోరాహోరీ మ్యాచ్‌లో కొండపి–1 విజేతగా నిలిచింది. ముందుగా ఇరు జట్లను ఎస్సై కె.నాగరాజు పరిచయం చేసుకున్నారు. ఎంపీడీఓ రమణమూర్తి, ఎంఈఓ–2 పి.రామారావు, పీఈటీలు ఎస్.చంద్రశేఖర్, రవికిరణ్, కె.ప్రభాకరరావు, ఎస్‌కే సుల్తాన్‌బాషా, శిరోమణి పాల్గొన్నారు.

పొన్నలూరు: గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు క్రీడల్లో తమ ప్రతిభను కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు సూచించారు. ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించి మెడల్స్, ఆటవస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సర్పంచులు మన్నెం పద్మ, బడుగు సత్యకుమార్, మన్నెం చిన వెంకటేశ్వర్లు, పీడీ చిరంజీవిరెడ్డి, కార్యదర్శి హరినారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరు: వల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో ఎం.నిడమానూరు, టంగుటూరు–2 జట్లు తలపడ్డాయి. పోటాపోటీగా సాగిన మ్యాచ్‌లో టంగుటూరు–2 విజేతగా నిలిచింది. అనంతరం క్రీడాకారులకు ఎంపీడీఓ రత్నజ్యోతి క్రీడా కిట్లు పంపిణీ చేశారు. పీపీ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమార్, సచివాలయ సిబ్బంది మురళి, ప్రకాష్, మహిళా పోలీసు ప్రియదర్శిని, వలంటీర్లు పాల్గొన్నారు.

జరుగుమల్లి: క్రీడాకారులు ఆటల్లో ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జరుగుమల్లి ప్రత్యేక అధికారి డాక్టర్ పి.సుజయ్‌కుమార్ ఆకాంక్షించారు. చింతపాలెంలో నిర్వహించిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తూమాడు–చింతలపాలెం టీములు హోరాహోరీగా ఆడాయి. విజేతగా నిలిచిన చింతలపాలెం జట్టుకు రూ.2 వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన అశోక్‌కు రూ.1,000ను ప్రత్యేక అధికారి బహూకరించారు. ఎంపీడీఓ కె.జలజాక్షి, ఎంఈఓ డి.శ్రీనివాసరావు, పీడీలు ప్రసాద్, శ్రీనివాసరావు, నర్రా కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు కిషోర్, రామకృష్ణ, కె.రవిబాబు, సచివాలయ సిబ్బంది, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పోలినేనిపాలెం

వలేటివారిపాలెం: మండలంలోని చుండి మోడల్ స్కూల్ మైదానంలో శనివారం మండల స్థాయి క్రికెట్ పోటీలు ఫైనల్ జరిగినట్లు ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ అన్నారు. అడుదాం ఆంధ్ర కార్యాక్రమంలో భాగంగా క్రికెట్ పోటీల్లోని ఫైనల్‌లో భాగంగా పోలినేనిపాలెం, అయ్యవారిపల్లి టీంలు తలపడగా పోలినేనిపాలెం జట్టు విజయం సాధించి కందుకూరు స్థాయి పోటీలకు ఎన్నికై నట్లు ఆయన తెలిపారు. పోటీలను ఉద్దేశించి గ్రామ సర్పంచ్ ఇరుపని సతీష్ మాట్లాడుతూ గెలుపు ఓటములు ఆటలో భాగమేనని, ఓడిన టీమ్ నిరుత్సాహ పడకూదని ప్రోత్సాహం అందించారు. ఎంపీటీసీ యానదయ్య, పీఈడీలు మల్లికార్జున, ఐజాక్, సునీత తదితరులు పాల్గొన్నారు.


కొండపిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై నాగరాజు


పోలినేనిపాలెం జట్టుతో ఎంపీడీఓ, పీఈడీ


పొన్నలూరులో క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అందులో భాగంగానే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కల్పన, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మొహమ్మద్ కైఫ్‌కు ఘన నివాళి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి నారాయణ, ఏఎంసీ చైర్మన్ సాల్మన్

కనిగిరి రూరల్: సయ్యద్ మొహమ్మద్ కైఫ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఘన నివాళి అర్పించారు. స్థానిక సీపీఐ ఆఫీసులో జీపీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ చిన్న వయస్సులోని ఉద్యమాల వైపు ఆకర్షితుడైన మొహమ్మద్ కైఫ్ చిరస్మరణీయుడన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకుడిగా కైఫ్ అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడని కొనియాడారు. అనంతరం పేదలకు, వృద్ధులకు, కార్మికులకు, వృద్ధాశ్రమంలో అనాథలకు, వృద్ధులకు అన్నదానం చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సీహెచ్ సాల్మన్, వాసవీ సత్రసముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్, ఎస్‌డీ మౌలాలి, సలార్, సుబ్బారావు, మోహన్, జి బాలిరెడ్డి, పుట్టా సుబ్బారావు, ఖాశింవలి, ప్రొఫెసర్ కేవీఎస్ రాజు,న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు పీర్ల మస్తాన్‌వలి, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు పసుపులేటి అరుణోదర్, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, కౌన్సిలర్లు, న్యాయవాదులు, వివిధ సంఘాల నాయకులు, కైఫ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన పక్కాగా చేపట్టాలి


కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషుబాబు


లింగంగుంట్లలో కులగనన సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది


ఇమ్మడిచెరువులో కులగణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెలిగండ్ల: కుల గణన సర్వేను పారదర్శకంగా, పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని ఇమ్మడిచెరువు, పి.నాగులవరం, పి.రాళ్లపల్లి, రామగోపాలపురం, గుడిపాటిపల్లి గ్రామాల్లో జరుగుతున్న కుల గణన సర్వేను ఎంపీడీఓ టి.సుకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ సామాజిక వర్గాల వారీగా కులగణన చేసి సంక్షేమ పథకాల అమలు చేసేందుకు కులగణన సర్వే ప్రభుత్వం చేపట్టిందన్నారు. కుల గణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

లింగసముద్రం: కులగణన సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. మండలంలోని రాళ్లపాడు గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేలో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సర్వే సులభంగా అర్థమయ్యే రీతిలో యాప్ రూపొందించినట్లు, సర్వేలో సిబ్బందికి ఎటువంటి రుజువు పత్రాలు చూపించాల్సిన అవసరం లేదని, కేవలం సమాచారం మాత్రమే తెలపాలని ప్రజలను కోరారు. సర్వేను సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు.

హనుమంతునిపాడు: మండలంలో కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 23 పంచాయతీ పరిధిలోని 14 గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కులగణన సర్వే చేస్తున్నారు. సర్వేను ఏఓ కృష్ణారావు, వీఆర్ఓలు, కార్యదర్శులు హనుమంతునిపాడు, మొరవారిపల్లి, లింగంగుంట్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో కులగణన సర్వే నిర్వహణను పరిశీలించారు. సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఇంటిని సందర్శించి యజమానితో సర్వేకు సంబంధించి అన్ని వివరాలు అడిగి తెలుసుకొని సర్వేకు సహకరించాలంటున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కందుకూరు: పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ పవిత్ర పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి తెలిపారు. ఈ బస్సు రాత్రి 8 గంటలకు కందుకూరు డిపో నుంచి అరుణాచలం బయలుదేరుతుందన్నారు. యాత్రలో భాగంగా తిరుత్తని, తిరువళ్లూరు, విష్ణుకంచి, శివకంచి, కంచి కామాక్షమ్మ, అరుణాచల గిరి ప్రదక్షిణ, దర్శనం, గోల్డెన్ టెంపుల్ వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకో వచ్చునని చెప్పారు. బస్సులో భోజనంతో కలుపుకుని ఒక్కొక్కరికి టిక్కెట్ రూ.2600 నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు 9959225698, 7382889870 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి బంగారు హారం బహూకరణ

మర్రిపూడి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో ఒకటైన పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి వారికి పొదిలి వాస్తవ్యులు బి.ప్రదీప్‌కుమార్ ధర్మపత్ని సుస్మిత సుమారు రూ.1.10 లక్షల విలువైన బంగారు గొలుసు బహూకరించారు. అర్చకులు నారయణం మారుతీచార్యులు స్వామికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి.హరిప్రసాద్, సునందిని, కల్లం సుబ్బారెడ్డి, నిర్మల, పల్లెర్ల శ్రీనివాసులరెడ్డి, కె.నరసింహారావు, ఈఓ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

వెలిగండ్ల: మండలంలోని పి.రాళ్లపల్లి, వెదుళ్లచెరువు పంచాయతీల్లో ఎంపీడీఓ టి.సుకుమార్ ఆధ్వర్యంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఎస్ రంగకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. రైతులు పొలాలకు మందు ఎలా పిచికారీ చేయాలో డ్రోన్ సహాయంతో డెమో ద్వారా వివరించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

లింగసముద్రం: బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించిన ఘటన మండలంలోని మొగిలిచర్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు..రెండు రోజుల క్రితం మొగిలిచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి బంధువైన పదేళ్ల బాలికను లింగసముద్రం వెళ్లి చికెన్ తీసుకువద్దామని చెప్పి మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని వెళుతుండగా రాళ్లపాడు బంగ్లా వద్దకు రాగానే పొదల్లోకి తీసుకెళ్లి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి

పీసీపల్లి: అయోధ్యలో ప్రారంభమయ్యే రామమందిర శుభదినాన్ని పురస్కరించుకొని త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు మల్లేశ్వర స్వామి దేవస్థాన ఆలయ అర్చకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు పెదయిర్లపాడులో ఆలయం నుంచి శోభయాత్ర ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.